
# నడిపోడు




***“....అమ్మ చావు బతుకుల్లో వుంది....చింటూగాడు అమెరికాలో వున్నాడు. ఫోన్లో ఇప్పుడే రాలేనంత బిజీ అంటాడు....ఎలా? ఏం చేయాలి? పోనీ...పెద్దన్నయ్యకి కరీంనగర్ కబురంపితే...”***

క్షీణిస్తున్న తల్లి పరిస్థితిని చూస్తూ వీర్రాజు మనసు మనసులో లేదు. ఇవే ఆలోచనలు ముసురుకుంటున్నాయి. అసహనంగా ఇంట్లో అటూఇటూ తిరుగుతున్నాడు. రామలక్ష్మి భర్త పరిస్థితిని చూస్తూ....“ అమెరికాకి ఫోన్లమీద ఫోన్లు చేయకండి. ఇప్పటికే వేలకొద్ది బిల్లు తగిలేసారు. ఆవిడగారు కన్ను మూసాక ఫోన్ చేయవచ్చు” అంది కాస్త కటువుగా.

ఆమెకు వాళ్లంటే కోపం...ఆస్తి పంపకాల్నించీ ఇప్పటివరకూ తామే నష్టపోయామన్న బాధ. వీర్రాజు ఈ ఇంట్లో నడిపోడుగా పుట్టడమే ఆయన చేసుకున్న పాపమేమో అన్పించేది.

వీర్రాజు అన్న కరీంనగర్ ఆర్ అండ్ బి ఆఫీస్‌లో సూపర్నెంటు. తమ్ముడు అమెరికాలో కంప్యూటర్ ఇంజనీర్. వీర్రాజు మాత్రం పెద్దగా చదువులేక పల్లెలోనే వుండాల్సివచ్చింది. తల్లిదండ్రుల పెంపకంలోనూ వీర్రాజు పట్ల పక్షపాత ధోరణే ఒరిగింది. మొదటపుట్టిన బిడ్డ అని వాళ్ళ పెద్దబ్బాయిని ప్రేమగా పెంచారు. తండ్రికి పెద్దోడంటే అభిమానం. పెద్దోడు పుట్టిన ఏడేళ్లకి వీర్రాజు పుట్టాడు. వీర్రాజు పుట్టిన రెండేళ్లకే చిన్నోడు పుట్టాడు. తల్లికైతే చిన్నోడంటే పంచప్రాణాలు. పట్నంలో ఇంగ్లీష్ మీడియం స్కూల్లో చదివించింది.

తండ్రి పెద్దకొడుకుతో ప్రతి విషయం చర్చించేవాడు. ‘కన్నా’ అని ముద్దుగా పిలిచేవాడు. చిన్నోడిని తల్లి ‘చింటూ’ అంటూ పిలిచేది. వీర్రాజుకి ఏ ముద్దు పేరు రాలేదు. ‘ఒరే...నడిపోడా...’ అనే పిలుపు తప్ప.

చిన్నప్పట్నించి ఈ వ్యత్యాసాన్ని వీర్రాజు గమనిస్తూనే వున్నాడు. పెద్దకొడుకుని తండ్రి పొలాలవెంట తిప్పుకొస్తే.... తనూ వెంటవస్తాననే వాడు వీర్రాజు.

“వాడు ఈ ఇంటికి పెద్దకొడుకు. వాడికి అన్నీ తెలియాలి. నా తర్వాతి స్థానం వాడిదే. నువ్వు బుద్ధిగా చదువుకో” అని తండ్రి అంటే మనసు గిలగిల్లాడేది.

చిన్నకొడుక్కి తల్లి గారాబంతో అన్నీ పెడుతుంటే...“అదేంటమ్మా...నాకూ సంజీవ్‌గాడిలాగా పెట్టవూ....” అని ప్రాధేయపూర్వకంగా అడిగితే...తల్లి నవ్వేది. “వాడు ఈ ఇంట్లో చిన్నోడు కదరా....అందుకే కొంచెం గారాబం ఎక్కువుంటుందిలే” అనేది.

తననీ ఎవరైనా ఏదైనా ముద్దుపేరుతో పిలిస్తే బావుండేది అని మనసు కోరుకునేది.

‘నడిపోడా...’ అని పిలిస్తే చివుక్కుమనేది.

ఈ భావం వీర్రాజు మనసులో క్రమంగా పెరుగుతూనే వచ్చింది. ఇంట్లో కొడుకుల పరంగా ఏ విషయం చర్చించినా ‘ఇంటికి పెద్దోడు’ ‘ఇంటికి చిన్నోడు’ అనే పదాలు దొర్లిపోయేవి.

తండ్రి వెంట తిరగటం వల్లనేమో...పెద్దోడికి అప్పుడే ‘పెద్దరికం’ వచ్చేసింది. మాటల్లో చేతల్లో అది చూపించేవాడు.


‘ఒరే వీర్రాజు...తమ్ముని ఎత్తుకో’ అని ఆర్డరేసేవాడు కాని...ఏడుస్తున్న తమ్ముణ్ణి ఎత్తుకునేవాడు కాదు.

అతి గారాబం వల్లనేమో...చిన్నోడికి ‘అధికారం’ వచ్చేసింది. అది వాడు ఏడ్చి, గిల్లి, కొట్టి, కోరికి చూపించేవాడు. ఏనాడైనా ‘ఐస్‌ఫ్రూట్’ కొనుక్కుంటే...మీదపడి రక్కి లాక్కునేవాడు. తనేడిస్తే తల్లివచ్చి ‘పోనీలేరా...వాడు చిన్నోడు కదా’ అని ప్రతిసారీ వాణ్ణి సమర్థించేది.

ఇద్దరికంటే ఎక్కువమంది కొడుకులున్న కుటుంబాల్లో...మధ్యలో పుట్టినవాళ్లంతా మానసికంగా ఇలాంటి సంఘర్షణలు అనుభవించేవుంటారని వయసు ఎదిగినకొద్దీ వీర్రాజుకి అన్పించేది.

క్రమంగా అంతా ఎదిగి... పెళ్లిళ్లయ్యాక...పెద్దవాడికి ఉద్యోగమొచ్చి కరీంనగర్ వెళ్లిపోయాడు. చిన్నవాడు అమెరికా వెళ్లిపోయాడు. వాళ్లు వెళ్తూవెళ్తూ...చాలీచాలని జీతంతో పట్నంలో మిమ్మల్నెలా పోషించగలం అని పెద్దోడు చెప్పేసి వెళ్తే....అమెరికాకి మిమ్మల్ని తీసికెళ్లటం అస్సలు సాధ్యం కాదు అని చిన్నోడు వెళ్లిపోయాడు.

ఫలితంగా వ్యవసాయం చూసుకుంటూ వీర్రాజే తల్లిదండ్రుల్ని పోషించేవాడు. అయితే ఆర్నెల్లకోమారు పెద్దకొడుకు వచ్చి తల్లిదండ్రులతో ఆప్యాయంగా గడిపేవాడు. వాడు రాగానే తల్లీతండ్రీ కన్పించే ప్రేమ చూసి వీర్రాజు మనసు మూగవోయేది. ఒక్కరోజు గడిపి వెళ్లిపోతూ “ఒరే వీర్రాజూ...ఈసారి పంటలమీద నావంతు డబ్బు ఎంతొచ్చింది” అని ఒంటరిగా వున్నప్పుడు అడిగేవాడు. వీర్రాజు లెక్కచూసి నాలుగైదువేలు అప్పజెప్పిన వెంటనే వెళ్లిపోయేవాడు.



కె.వి.నరేందర్

అమెరికా నుంచి చిన్నోడి ఉత్తరం అందగానే...తల్లిదండ్రుల కళ్లల్లో కనపడే ఆనందరేఖలు అన్నీఇన్నీకావు.

“ఇంత చాకిరీ చేస్తున్నాం...ఆ ప్రేమ కనీసం నా పిల్లలమీద చూపినా నేను సంతోషించేదాన్ని” అని వీర్రాజు భార్య రామలక్ష్మి నొచ్చుకునేది.

పొద్దంతా వ్యవసాయం చేసి వచ్చిన తన భర్త కష్టాన్ని గుర్తించకుండా.... అమెరికాలో కొడుకు ఏం కష్టపడుతున్నాడో అని తల్లి తరచూ గుర్తు చేస్తుంటే... అది సహించని రామలక్ష్మి తన అసహనాన్ని, కోపాన్ని పిల్లలమీద చూపించేది. దాంతో ఇంట్లో అందరి మధ్యా ఏదో దూరం పెరుగుతున్నట్టు అన్పించేది. పెద్దోడు వచ్చివెళ్లినప్పుడల్లా...అమ్మానాన్నల్ని బాగా చూసుకొమ్మని నీతివాక్యాలు చెప్పిపోయేవాడు.

ఒరోజు అర్ధరాత్రి...తండ్రికి గుండెపోటు రావటంతో వీర్రాజు తల్లడిల్లిపోయాడు. పల్లెలో సరైన సౌకర్యాలు లేక...నొప్పి ఎక్కువై తెలతెలవారుతుండగా తండ్రి చనిపోయాడు. పెద్దవాడికీ, చిన్నవాడికీ కబురుపంపి వాళ్లు రావడానికి వీర్రాజు పడ్డ కష్టాలు అన్నీఇన్నీ కావు. పెద్దకొడుకు వస్తూనే...నొప్పి గురించి రెండుమూడ్రోజుల ముందే తనకి ఫోన్ చేస్తే సిటీకి తీసికెళ్లేవాన్ని. తండ్రిని బతికించుకునేవాన్ని...అంటూ వూరివాళ్ల ముందు భోరున ఏడ్చాడు. పెద్దోడికి తండ్రి మీదున్న ప్రేమకి వాళ్లు సైతం కన్నీళ్లు పెట్టుకున్నారు.

చిన్నవాడు అమెరికా నుంచి రాలేకపోయాడు....ఫోన్ చేసి బాధపడ్డాడు.

దశదిన కర్మ అయ్యేంతవరకూ... ఖర్చులన్నీ వీర్రాజే భరించాడు.

ఆ మర్నాడే....“ ఆస్తిపంపకాలు చేసుకుందాం రా నడిపోడా...కరీంనగర్‌లో ఇల్లు కట్టుకుంటున్నాను. డబ్బు అవసరం వుంది” అన్నాడు పెద్దన్నయ్య.

“తమ్ముడు తిరిగొచ్చాక పంపకాలు చేసుకోవటం మంచిదేమో అన్నయ్యా” అన్నాడు వీర్రాజు.

“సరే...మరి నేను ఇంటికి పెద్దవాణ్ణి కాబట్టి....జ్యేష్ఠపు పాలు కింద చెరువుకింది అయిదెకరాల పొలం ఇవ్వాలి” అన్నాడు.

అది విన్న వీర్రాజు భార్య...కోపంగా లేచింది.

“మీకెందుకు జ్యేష్ఠప్పాలు ఇవ్వాలి? ఈ ఇంటికి మీరేం కష్టపడ్డారని....అసలు జ్యేష్ఠపుపాలు ఎందుకిస్తారో తెల్సా?” అని గయ్‌మని లేచింది రామలక్ష్మి.

దాంతో ఆరోజు పెద్దగొడవే జరిగింది.

ఫలితంగా...తెల్లవారి ఆస్తిపంపకాల విషయమై వూరి పెద్దలతో పంచాయితీ జరిగింది.

“తండ్రికి తలకొరివి పెట్టినోడు కాబట్టి....ఇంటికి పెద్దదిక్కు కాబట్టి జ్యేష్ఠపు

పాలు ఇవ్వాల్సిందే” అని వాళ్లు తీర్పు చెప్పారు.

వూరి పెద్దలకన్నా...వీర్రాజు తల్లి కూడా అదే మాటనడం... అతణ్ణి కృంగదీసింది. అతడు అపురూపంగా చూసుకునే పొలం పెద్దవాడికి జ్యేష్టపుపాలు కింద పోగా... మూడ్రోజుల్లో దాన్ని ఎనభైవేలకి అమ్మేసుకుని అతడు వెళ్లిపోయాడు.

వీర్రాజు తల్లి...భర్తపోయిన బాధలో మంచమెక్కింది.

శాపనార్థాలు పెడుతూనే రామలక్ష్మి ఆమెకు అన్ని సేవలు చేస్తోంది. దాదాపు ఆర్నెల్లుగా ఆమె మంచంలోనే మలమూత్రాలు చేసుకుంటున్నా భరిస్తూ చేస్తున్నారు.

కాని... పరిస్థితి ఇప్పుడు విషమించింది.

తల్లి ఎప్పుడు కన్ను మూసేది తెలీని స్థితిలో రాత్రుల్లో కూడా నిద్రమానుకొని తల్లి మంచం దగ్గరే వుంటున్నాడు వీర్రాజు.

ఆ తల్లిమనసు.... దూరంగా వున్న చిన్నకొడుకు కోసం పలవరిస్తోంది.

“ఒరే నడిపోడా....ఒక్కసారి చింటూగాన్ని పిలిపించురా....” అని వందల సార్లు అడిగింది.

భార్యకి భయపడి ఏమీ అనకపోయినా... బయటికెళ్లి రెండుమూడుసార్లు ఆమెరికాకి ఫోన్ చేసొచ్చాడు. వాడు పొడిపొడిగా మాట్లాడటం తప్పితే...వస్తాను, రాను అని ఏ విషయమూ చెప్పలేదు.

వీర్రాజు మాత్రం తల్లిని ఊరడిస్తూనే వున్నాడు.

చిన్నకొడుకు కోసం పలవరించి... పలవరించి కన్నుమూసిందామె.

వీర్రాజు దుఃఖం కట్టలు తెంచుకుంది. కరీంనగర్‌నించి పెద్దకొడుకు హుటాహుటిన వచ్చాడు.

అమెరికాకి ఫోన్ చేసి విషయం చెప్పారు.

“వాడొచ్చేసరికి రెండుమూడ్రోజులవుతుందేమో...అప్పటి వరకూ అమ్మనెలా వుంచుదాం?” బాధగా అన్నాడు వీర్రాజు పెద్దమనుషుల్తో.

“అదేంట్రా...తల్లికి చిన్నకొడుకే కొరివి పెట్టాలి. వాడొచ్చేంతవరకూ మంచుగడ్డల్లో శవాన్ని పెట్టి వుంచండి” అన్నారంతా.

“వాడు అందుబాటులో లేనప్పుడు... నేను పెట్టకూడదా?” వీర్రాజు మనసులో ఏదో సంశయం.

“నువ్వు ఈ ఇంటికి నడిపోడివి... నువ్వెలా తలకొరివి పెడతావ్? అది మన సాంప్రదాయం కాదు” అన్నారు పెద్ద మనుషులు.

తల్లిదండ్రులకు బండెడు చాకిరీ చేసినా తలకొరివి పెట్టడానిక్కూడా అర్హతలేని తనమీద తనకే జాలిపుట్టింది వీర్రాజుకి.

‘నడిపోడు’ అనే ఒక్కపదంతో బాధ్యతలన్నీ నెత్తిమీదపెట్టినా...సంప్రదాయపరంగా ఇవేం అడ్డుతెరలు?? ఆ బాధనే వ్యక్తపరుస్తూ తన ఆప్తమిత్రుడైన సర్పంచ్ రాఘవరావ్‌తో చెప్పుకున్నాడు.

అతడు వీర్రాజుని ఓదారుస్తూ “పిచ్చోడా... రామాయణ కాలంనించీ నడిపోడికి ఈ బాధలు తప్పలేదు. భరతుడు రాముడి పాదరక్షల్ని సింహాసనం మీద చూపిస్తూ తను రాజ్యపాలన చేయాల్సి వచ్చింది. భారతంలో సైతం అర్జునుడే అందరికీ శతృవయ్యాడు కాని.... ధర్మరాజో, సహదేవుడో కాలేదు....” అన్నాడు.

“ఇలా ఎందుకుండాలి? పెద్దవాడు, చిన్నవాడితో పోలిస్తే మధ్యలో పుట్టిన వాళ్లు కుటుంబసంప్రదాయపరంగా వ్యక్తిత్వం లేని వాళ్లవుతున్నారు. డమ్మీ కొడుకులుగా మిగులుతున్నారు. మాలోని ప్రేమలూ, ఆప్యాయతలూ పంచుకొంటూనే... కట్నకానుకల దగ్గర, ఆస్తిపంపకాల దగ్గర, అంత్యక్రియల దగ్గర భేదాలు చూపించటం ఎంతవరకు సబబు...” అని బాధపడ్డాడు.

అప్పటికే అమెరికా నించి చిన్నవాడు రావటంతో.... హడావిడిగా అంత్యక్రియలు జరిపారు.

పదకొండోరోజున మళ్లీ ఎక్కడివాళ్లక్కడ వెళ్లిపోయారు.

ఇల్లంతా స్మశాన నిశ్శబ్దం....

దిగాలుగా వున్న వీర్రాజు దగ్గరికి రామలక్ష్మి వచ్చి కూచుంది.

“నాకు తెలుసయ్యా.... నువ్వు తల్లిదండ్రుల్ని ఎంత ప్రేమించిందీ... ఎంత సేవ చేసిందీ.... నీ చేతులమీదుగా వాళ్లని పంపించాలని ఆశపడ్డావ్...కాని అలా జరగనందుకు బాధపడుతున్నావా....” అంది.

వీర్రాజు ఏమీ మాట్లాడలేదు.

“మీకు మరో విషయం చెప్పాలి...” అంది కొంచెం సంశయంగా.

“ఏంటి?”

“నాకు మళ్లీ నెల తప్పింది. ఇప్పటికీ మనకిద్దరు మగపిల్లలున్నారు కదా. ఈసారి ఆడపిల్ల పుట్టొచ్చు....”

ఆ మాటతో వీర్రాజు మొహంలో కలవరం పాకిపోయింది.

“ఆడపిల్లే పుడుతుందన్న గ్యారంటీ ఏమిటి? మళ్లీ మగపిల్లాడు పుడితే...? ఈ ఇంట్లో ‘నడిపోడు’ అనే పేరుతో మరొకడు నలిగిపోవటం నాకిష్టం లేదు. రేపే దావఖానకెళ్లి అబార్షన్ చేయిద్దాం....” అని చెప్పేసి విసురుగా లేచి వెళ్లిపోయాడు.

అతడు వెళ్లినవైపే విభ్రమంగా చూస్తుండిపోయిందామె.

●

స్వగతం



## కృతజ్ఞతగా ఉంటారు...


రంజాన్‌అలీ

మాది వరంగల్‌జిల్లా మహబూబాబాద్ పట్టణం. నేను పదవ తరగతి వరకు మా ఊర్లోనే వున్న ప్రభుత్వ పాఠశాలలో చదివాను. వరంగల్‌లోని ఏంజెతన్ జూనియర్ కాలేజీలో ఇంటర్‌లో చేరాను. ప్రతిరోజు కళాశాలకు ట్రైన్‌లో వెళ్ళేవాడిని. ప్రతిరోజు టిక్కెట్ కొనక్కర్లేకుండా మూడునెలలకు ఒకసారి సీజన్ టిక్కెట్ కొనుక్కునేవాడిని. ఒకరోజు వరంగల్ రైల్వేస్టేషన్‌లో సీజన్ టిక్కెట్ కొనుక్కుని వెంకట్రామ థియేటర్‌లో ‘హమ్‌రాజ్’ అనే హిందీ సినిమా చూడడానికి వెళ్ళాను. నాకు పాత సినిమాలంటే ఇష్టం కావడంతో జనం ఎక్కువమంది ఉన్నా కష్టపడి టిక్కెట్ సంపాదించి సినిమా చూశాను. గోల్కొండ ట్రైన్ 5.15ని.లకు వస్తుంది. ప్రతిరోజు ట్రైన్ లేటుగానే వచ్చేది. ఆరోజుకూడా ఆలస్యంగానే వస్తుందన్న ధైర్యంతో సినిమా అయిపోయాక స్టేషన్‌కు వెళ్ళాను. కానీ ఆరోజు టైముకే రైలు వెళ్ళిపోయింది. టీ తాగుదామని పాకెట్‌లో చిల్లర కోసం చూసుకునేసరికి పర్సులేదు. థియేటర్‌లో పడిపోయిందేమోనని వెళ్ళి వెతికాను. దొరకలేదు. దాంట్లో డబ్బులు సీజన్ టిక్కెట్, ఐడెంటిటి కార్డు వున్నాయి. నాదగ్గర అసలు డబ్బులులేవు. నా మిత్రులు కూడా ఆ ట్రైన్‌లో వెళ్ళిపోయారు. సాయంత్రం 6.45కు మద్రాస్ ట్రైన్ వుంది. ఆ ట్రైన్‌లో మా ఊరు వెళ్దామంటే టిక్కెట్ కొనాలి. నా దగ్గర డబ్బులు లేవు. ఏమైతే అయిందిలే అని మొండిధైర్యంతో జనరల్ కంపార్టుమెంట్‌లో ఎక్కాను. సగం దూరం వెళ్ళాక టి.సి వచ్చాడు. ఆయన నన్ను సమీపిస్తున్న కొద్దీ నాలో కంగారు ఎక్కువైంది. నేను పుస్తకం చదువుతున్నట్లు నటించాను. దేవుని దయవల్ల నాకంటే ముందు టిక్కెట్ లేనివారు ఉండటంతో టిసి వారితో వాదిస్తున్నాడు. అదిచూసి నాలో ఇంకా భయం పెరగసాగింది. మా ఊరు సమీపిస్తున్నప్పుడు టిసి నావద్దకు వచ్చారు. నేను భయంభయంగా పాస్ అన్నాను. నాచేతిలో పుస్తకం చూసి వెళ్ళిపోయారు. ఈవిధంగా మా ఊరు చేరుకున్నాను. మర్నాడు కాలేజీకి వెళ్ళాలంటే ఏంచేయాలో అర్థంకాలేదు. ఇంట్లో అనుమానం రాకుండా నా స్నేహితులను కూడా మూడురోజులు కాలేజీమానిపించాను. ఇంకా మానేస్తే ఇంట్లోవాళ్ళకి అనుమానం వస్తుందని నాలుగోరోజున కాలేజీకి వెళ్ళాను. నేను వెళ్ళిన కొద్దిసేపటికే అటెండర్ వచ్చి ప్రిన్సిపాల్ పిలుస్తున్నారు అన్నాడు. నేను కాలేజీకి రావట్లేదని పిలుస్తున్నారేమోనని భయంతో వెళ్ళాను. నేను వెళ్ళగానే ప్రిన్సిపాల్ నీ ఐటెంటిటి కార్డు ఏది? అన్నారు. ఇంట్లో వుంది అని చెప్పాను. అప్పుడు ప్రిన్సిపాల్ నా కార్డు చూపిస్తూ ఇది నీదేనా అన్నారు. వెంటనే అవును నాదేసార్ అన్నాను. ఐడెండిటి కార్డుతోపాటు పర్సు, దానిలోని డబ్బులు సీజన్ టిక్కెట్ ఇచ్చారు. ఎవరో వీరేష్ అనేవ్యక్తి వచ్చి నీ పర్సు ఇచ్చాడు అని చెప్పారు. ఐటెంటిటి కార్డులోని కాలేజీ అడ్రస్ చూసి వచ్చి ఇవ్వడం నాకు ఆశ్చ ర్యం కలిగించింది. అతని నీతి నిజాయితీకి మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకున్నాను. ఏదైనా వస్తువుపోతే వారి బాధ, కష్టాలు ఎలా ఉంటాయో అనుభవపూర్వకంగా తెలుసుకున్నాను. అప్పటి నుండి నాకెవరి వస్తువులు దొరికినా వారికి చేరవేయడం నా బాధ్యత, కర్తవ్యంగా భావిస్తున్నాను. పోయిన వస్తువులు దొరికితే వారి ఆనందం అంతులేనిది. వారు మన పట్ల కృతజ్ఞతగా ఉంటారు.

**- మహ్మద్ రంజాన్‌అలీ,**
వరంగల్

## అమ్మ ఋణం తీర్చలేనిది

అమ్మ అనే రెండు అక్షరాల పదంలో ఎంతో ప్రేమ, ఆప్యాయత, అనురాగాలు వున్నాయి. తను తిన్నా తినకపోయినా తను ఎన్ని కష్టాలైనా పడి టైముకు పిల్లల ఆకలి దప్పులను తీర్చాలనే తపనతో అల్లాడిపోయే మాతృమూర్తి అమ్మ. మా నాన్నగారు గవర్నమెంటు సర్వీసులో అటెండరుగా ఉండేవారు. అందువల్ల చాలీచాలని జీతం కుటుంబ సభ్యులందరికీ తినడానికి సరిపోయేదికాదు. అమ్మకూడా బర్రెలను మేపి, గడ్డిమోపులు మోసి రాత్రింబవళ్ళు కష్టపడి పనిచేసేది. తాను ఎన్ని కష్టాలుపడినా తన పిల్లలు బాగా చదువుకోవాలనే ఉద్దేశంతో మమ్మల్ని చదివించారు.



విజయ్‌కుమార్

ఫీజులకు అమ్మే డబ్బులు ఇచ్చేది.నేను బి.ఎ పాసయ్యాను. అన్నయ్య బి.కామ్, బి.ఎల్.ఎస్.సి చదివాడు. తమ్ముడు ఐ.టి.ఐ ఫిట్టర్ చదివాడు. మమ్మల్ని చదివించడానికి అమ్మ ఎన్నో కష్టాలు పడింది. తన తిండి నిద్రాహారాలను కూడా త్యాగంచేసి మమ్మల్ని చదివించింది. ఆమెకు మేమంత చేసినా ఋణం తీర్చుకోలేము. ‘స్వగతం’ శీర్షిక ద్వారా అమ్మకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

**బుర్రి విజయ్‌కుమార్, గుంటూరు**